# అపనమ్మకం

రాత్రి 10 గంటలు దాటింది. చెల్లెలు రజని రాకకు ఎదురు చూస్తోంది అసహనంగా కమల. ఇంతసేపటి వరకూ పెళ్ళికాని ఆడపిల్ల ఇట్లా తిరగమేమిటని చాలా ఆందోళనగా ఉందామెకు. కమల భర్త శ్రీనివాసరావు క్యాంప్ మీద ఊరెళ్ళాడు. ఇంతలో ఇంటి ముందు కారు ఆగిన శబ్దం ... కారు దిగి రజని కారులోని వ్యక్తికి "బై" చెప్పి లోపలికి వచ్చింది. చెల్లెలంటే ప్రాణం కమలకి. ఆమె భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటోంది కమల ... కానీ రజని ఈ విధంగా తిరగడం ... కమలలో ఆవేశం, కోపం పెల్లుబుకుతున్నై. "రజనీ! ఇంత పొద్దు పోయిందాకా ఎక్కడికి వెళ్ళావు?" తీవ్రంగా ప్రశ్నించింది. "సినిమాకు వెళ్లాను." నిర్లక్ష్యంగా అంటూ లోపలికి వెళ్ళబోయింది.

"రజనీ! ఆగు, నిన్ను కార్లో దింపింది ఎవరు? అర్ధరాత్రి మగవాళ్ళతో షికార్లేమిటి?" అని నిలవేసింది కమల. "నేను నాఇష్టం వచ్చిన వాళ్ళతో తిరుగుతాను. అడగడానికి నువ్వెవరు?" అంటూ ఎదురు తిరిగింది రజని. "నేను ఎవరు అని ప్రశ్నించేంత గొప్పదానివైనావా? ప్రతిక్షణం నేనెవరో గుర్తుచేసి కానీ మాట్లాడకూడదా?" కమల గొంతులో కాఠిన్యంతో పాటు ఆవేదన కూడా తొంగి చూసింది.

"అమ్మ చనిపోయింది కనక నీ దగ్గరకు వచ్చాను. అంత

మాత్రాన నా మీద నీకు హక్కు వచ్చిందా? నీ హద్దులో నువ్వు ఉండటం మంచిది. నేనూ పసిపిల్లనేం కాను. నా భవిష్యత్తును నేనే నిర్ణయించుకోగలను. నన్ను పోషించినందుకు డబ్బు కావాలంటావేమో- ఇదిగో.... ఈ వజ్రపుటుంగరం తీసుకో.... నా జోలికి మాత్రం రాకు." చాలా నిర్లక్ష్యంగా తన వేలికున్న ఉంగరంతీసి అక్క మీదికి విసిరేసింది. అది తన పుట్టిన రోజుకు తన అక్కే బహుమతిగా ఇచ్చిందని ఆమెకు గుర్తుకు రాలేదు అప్పుడు.

ఇన్నాళ్ళ ఓపికా కరిగిపోయింద కమలలో. మనసు మండిపోయింది "ఎవడి క్కావాలే నీ డబ్బు? నాక్కావలసింది నువ్వూ, నీ భవిష్యత్తు. నీకు అహంకారంతో కళ్లు మూసుకు పోయి ఏమీ కనిపించడం లేదు. నాకేం హక్కుందని కదూ నిలదీశావు? నువ్వూ.... నువ్వు నా పేగు తెంచుకు పుట్టిన బిడ్డవే.... నా పెళ్ళి కాకముందు తొందరపడ్డ కారణంగా నువ్వు పుట్టావు. నా భవిష్యత్తు పాడు కాకూడదని మా అమ్మ నిన్ను నా బిడ్డలా కాక తన బిడ్డలా పెంచింది. ఆ తరవాత నా పెళ్లైంది. కాపురానికి వచ్చాను. అమ్మ చనిపోయిన తరువాత నిన్ను నా దగ్గరకు తెచ్చుకున్నాను. నా ఒడిలో అపురూపంగా పెంచాను.... ఇప్పుడు చెప్పవే నీ మీద నాకు హక్కుందో లేదో...."

రజని మనసులో భావాలకు అనుగుణంగా ఆమెకళ్లు ఆర్ద్రమయినై. "అమ్మా" అంటూ పశ్చాత్తాప హృదయంతో ఆమె తన మాతృమూర్తిని కౌగిలించుకుంది.

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 11-6-1986)